
కాళికాలయం
మధుబాబు

# కాళికాలయం

( సస్పెన్స్, మిస్టరీ సీరియల్)

## ( మొదటి భాగం)

రచన

మధుబాబు

మధుబాబు పబ్లికేషన్స్,

మాచవరం,

విజయవాడ-520 004

*KALIKALAYAM*

*PART-1*

*By*

*MADHUBAABU*

*(C) M.B. Publications*

*ద్వితీయ ముద్రణ: 2008*

*ఇందులోని పాత్రలు, ప్రదేశాలు, సన్నివేశాలు సంఘటనలు కేవలం కల్పితాలు. ఎవరినీ ఉద్ధేశించి వ్రాసినవి కావు.*

ఈ పుస్తకాన్ని డిజిటల్ పబ్లిష్ చేసిన వారు :

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

# కాళికాలయం

( మొదటి భాగం)

పెద్ద పెద్ద కంఠాలతో వందిమాగధుల బిరుదావళులు చదువుతుండగా, మంత్రి సామంత దండనాయకులందరూ చేతులెత్తి జయజయధ్వానాలు చేస్తూ వుండగా, సభాభవన ప్రవేశం చేసి, రత్నఖచిత వజ్ర సింహాసనాన్ని అధిష్ఠించాడు మాళవదేశ పాలకుడు కీర్తిసేన మహారాజు.

సాక్షాత్తు ధర్మదేవత అవతారమే అతడని అంటూ వుంటారు మాళవ పౌరులు. నెలకు

మూడు వానలు కురుస్తాయి ఆ మహనీయుడి పరిపాలనలో. చెరువులు, దొరువులు, కాలువలు, బావులు చవులూరించే కమ్మని నీటితో నిండివుంటాయి ఎల్లప్పుడూ.

ధాన్యలక్ష్మి ఆ మాళవ సామ్రాజ్యాన్ని తన నివాసస్థలంగా మార్చుకున్నదేమో అనిపించేటట్లు, కనువిందొనరించే పంటలతో విలసిల్లుతూ వుంటాయి పంటపొలాలు. పండిన పంటలో ఎనిమిదో వంతు పన్నుల రూపంలో స్వీకరిస్తాడు మహారాజు. తిరిగి ఆ సంపదనంతా ప్రజాహిత కార్యక్రమాలకు వినియోగిస్తాడు. ఈతిబాధలు

లేవు. చోరభయాదులు లేవు. శత్రువుల దండయాత్రల బెదురు మొదటే లేదు.

కీర్తిసేన మహారాజు పరిపాలనలో సర్వసౌఖ్యాలు అనుభవిస్తున్నారు మాళవదేశంలోని పౌరులు.

రాజ్యాన్ని పదిరెండు మండలాలుగా విభజించి, మండలానికి ఒక మంత్రి సత్తముడిని నియమించాడు మహారాజు. మండల పరిపాలనా వ్యవహారాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, మంత్రులకు సలహాలు ఇస్తూ వుంటాడు. న్యాయ విచారణలో తలలు పండిన పదిమంది న్యాయాధికారులు రాజ్యం మొత్తంమీద కనిపించే

అన్యాయాలను, అభియోగాలను విచారించుతారు. ఆసమయంలో ధర్మసింహాసనాన్ని అధివసించి, స్వయంగా ఆవిచారణల్లో పాలుపంచుకుంటాడు కీర్తిసేన మహారాజు.

శిక్షలు చాలా క్రూరంగాను, భయంకరంగాను ఉండేవి. అమాయకులకు రక్షణ కూడా అదేమాదిరి ఉదాత్తంగా వుండేది. రాజధాని నగరమైన చంపకపురిలోని న్యాయసభకు వచ్చిన రెండు అభియోగాలను విచారించేందుకు కొలువు తీర్చాడు కీర్తిసేన మహారాజు ఆ రోజు. పరద్రవ్యాన్ని అపహరించేందుకు ప్రయత్నించిన అభియోగాలే ఆ రెండు. చంపకపురి నుండి పది ఆమడల

దూరంలో వున్న వీరపురానికి పోతున్న వర్తక సమూహాన్ని దారికాచి దోచుకోబోయారన్న నేరం మోపబడింది నలుగురు దొంగల మీద.

పదిరోజులపాటు విచారణ జరిపి, పదిపదుల మంది సాక్ష్యాలను విచారించి ఆ నలుగురి నేరాలను ధృవీకరించారు న్యాయాధిపతులు. ఎరుపు జీరలను పులుముకున్న కనులతో నిస్సంకోచంగా వారికి శిక్షలను ప్రకటించాడు కీర్తిసేన మహారాజు.

“పరద్రవ్యానికి ఆశపడిన ఈ తుచ్ఛుల చేతుల్ని మణికట్లు వరకూ నరికించి నట్టడివిలో వదిలిపెట్టండి.... ఆత్మరక్షణ చేసుకునే

అవకాశంలేక అడవిలోని క్రూరమృగాదుల అలజడికి బెదిరి అసువులు బాయటమే వారికి సరియైన శిక్ష. తీసుకు పొండి...”

ధర్మ సింహాసనాన్ని అధిష్టించి ఆ రాజు వెలువరిచిన శిక్షను వెంటనే ఆచరణలో పెట్టడానికి కదిలారు మాళవసైనికులు. ఆ బందిపోటు దొంగల కరచరణాలకు ఇనుప సంకెళ్ళు తగిలించి తీసుకుపోయారు.

తదుపరి అభియోగం వెన్వెంటనే మహారాజు ముందుకు తీసుకురాబడింది.

అర్థరాత్రి సమయంలో ఒక రైతు ఇంట ధాన్యాన్ని దొంగిలించబోతూ పట్టుబడిన పేద

యువకుడు ఒకతను తలవంచుకుని సభా మందిరం మధ్యన నిలుచున్నాడు.

అంతకు పదిక్షణికాలముందే బందిపోట్లకు విధింపబడిన శిక్షను వినివున్న సభాసదులందరూ ఊపిరి బిగబట్టి కుతూహలంగా మహారాజు ముఖంలోకి చూడటం మొదలుపెట్టారు. పక్షపాతానికి, మొఖమాటాలకు తావులేని తీర్పులు ఇవ్వటంలో దిట్ట ఆ కీర్తిసేనుడు... ఈ యువకునికి కూడా బందిపోటు దొంగలకు విధించిన శిక్షనే విధిస్తాడని వారి ఊహ.

పది క్షణికాలపాటు ఆ యువకునివైపే పరిశీలనగా చూసి, ఉన్నట్టుండి మహామంత్రి ధర్మదత్తునికేసి తిరిగాడు మహారాజు.

"ఈ యువకుడు నివసించే వీరపురి గ్రామాధికారిని వెంటనే ప్రవేశపెట్టండి" అని ఆజ్ఞ యిచ్చాడు.

శిక్ష వెలువడుతుందని ఎదురుచూస్తున్న సభాసదుల ఆశ్చర్యానికి అంతు అనేది లేకపోయింది..

విచారణ అంతకు ముందురోజే పూర్తి అయింది... పూర్తి అయిన విచారణను తిరిగి మరోసారి ప్రారంభించటం జరుగుతుందా? ?

సభాసదుల మనస్సులలో మొలకెత్తిన ఆ ప్రశ్నకు సమాధానం లభించకముందే వినమ్రంగా మహారాజు ముందుకు వచ్చాడు వీరపురి గ్రామాధికారి.

"వీరపుర పొలిమేరల్లో వున్న చెరువు గట్టుకు గండిపడి ఈ వత్సరం పంటలు పాడయిపోయాయని, తిండిగింజలకు కూడా ప్రజలు ఇబ్బంది పడవలసిన పరిస్థితి ఏర్పడిందని ఇంతకుముందు మీరు మాకు వర్తమానం ఒకటి పంపారు. అవునా?" గ్రామాధికారి ముఖంలోకి చూస్తూ ప్రశ్నించాడు కీర్తిసేనుడు.

పెదవులు విప్పే ధైర్యంలేక మూగగా తల ఊపాడు గ్రామాధికారి.

"మా ప్రజలెవరికీ ఆకలిబాధ వుండకూడదని వెంటనే రాచగాదెలను తెరిచి అందరికీ తిండిగింజలను పంచిపెట్ట వలసినదిగా మేము ఆజ్ఞలు పంపాము. అవునా? " మరో ప్రశ్న వేశాడు మహారాజు.

అందుకు కూడా అవనత వదనంతో అంగీకరించాడు గ్రామాధికారి.

"రాచగాదెలను తెరిచి ఉచితంగా ధాన్యాన్ని అందరికీ అందిస్తూ వుంటే, ఈ యువకుడు కేవలం ధాన్యం కోసమే దొంగతనం చేయవలసిన

అవసరం ఎందుకు వచ్చింది? " ఎదురుచూడని విధంగా ప్రశ్న వేయనే వేశాడు మహారాజు.

కత్తిపెట్టి కొట్టినా రక్తపుచుక్క కనిపించనట్లు తెల్లగా పాలిపోయింది గ్రామాధికారి వదనం.

మూగబోయిన కంఠాన్ని పెకలించుకుని ఏదో సమాధానం చెప్పటానికి ఎంతగానో ప్రయత్నించాడతను... అస్పష్టమైన శబ్దాలు మాత్రమే వెలువడ్డాయి. మాటలు మాత్రం బయటికి రాలేదు.

ధర్మాసనం మీద కూర్చున్న మహారాజు కనులు నిప్పు ముద్దలే అయ్యాయి.

కోపంతో ఆయన వదనం కుంకుమ అలదినట్లు ఎరుపురంగును పులుముకున్నది.

“ప్రకృతి సంక్షోభాలను అడ్డుగా పెట్టుకుని, మమ్మల్ని, మాప్రజల్ని మోసంచేయాలని చూచే నీవంటి అధములను క్షమించకూడదు. పేదప్రజలకు పంపిణీ చెయ్యమన్న ధాన్యాన్ని నువ్వు దిగమ్రింగి, అమాయకులను నేరాలు చేయటానికి ప్రోత్సహించావు... నీ అవినీతి కారణంగానే ఇతడు దొంగతనానికి పాల్పడ్డాడు అవునా? ”

ఉరుము ఉరుమినట్లు గంభీరంగా వినవచ్చిన ఆ వాక్కులను ఆలకించి, సన్నిపాత

జ్వరం వచ్చినట్లు గజగజలాడిపోయాడు ఆ గ్రామాధికారి.

"బుద్ధి గడ్డితిని ఈ తప్పుచేశాను... ఈ ఒక్కసారికి నన్ను మన్నించండి.... చేసిన తప్పును దిద్దుకునే అవకాశం ఇప్పించండి... మహారాజా.... నన్నుకాపాడండి..." ఎంతో ప్రయత్నంమీద గొంతును పెకల్చుకుని దీనాతిదీనంగా ఆక్రోశించాడు.

ఆ దీనాలాపనను విని కరిగిపోలేదు కీర్తిసేన మహారాజు. అతనికేసి చూడనుకూడా చూడలేదు.

"వృద్ధులైన తల్లిదండ్రుల ఆకలి బాధను చూసి తట్టుకోలేక తొంగతనం చేయటానికి

సిద్ధమయినాడు ఈ యువకుడు. మొదటి తప్పిందంకింద క్షమించి పెద్ద శిక్ష విధించకుండా వదిలిపెడుతున్నాము.

తనకు అన్యాయం జరుగుతోందని తెలిసినప్పుడు వెంటనే మాదగ్గిరికి వచ్చి తన బాధలను మాకు చెప్పుకోకుండా, అపసవ్య మార్గమే తన బాధలకు విరుగుడుగా భావించి నందుకు కొద్దిపాటి శిక్షను విధించదలిచాము. ఇక నుంచీ మూడు మాసాలపాటు ఇతను రాజధాని నగరంలో మా అశ్వశాలను శుభ్రపరిచేపనిలో నియుక్తుడు అవుతాడు. ఇతని సంపాదనలో సగభాగం పంపబడుతుంది.

మిగిలిన సగం మా కోశాగారానికి జమచేయబడుతుంది. మూడు మాసాల అనంతరమే ఇతనికి ఈ వెట్టిచాకిరీనుంచి విముక్తి లభిస్తుంది.'' అంటూ ముగించాడు మహారాజు.

కరతాళధ్వనులతో దద్ధరిల్లిపోయింది సభా భవనం. ఎంతో ఉదారంగాను, ఉదాత్తంగాను ఉన్న ఆ శిక్షను మెచ్చుకోని వారెవరూ అక్కడ లేరు.

విపరీతమైన భయంతో కంపించిపోతున్న గ్రామాధికారి విషయంలో మాత్రం ఉదారతను ప్రదర్శించలేదు మహారాజు. అతని ఆస్తిపాస్తులన్నిటినీ తను స్వాధీనపరుచుకున్నాడు.

అతన్ని ఆరుసంవత్సరాలపాటు తన అశ్వశాలలో పనిచేయటానికి పంపించాడు.

ఆ శిక్షను కూడా మెచ్చుకుంటూ తలలు ఊపారు సభలోని వారందరూ.

మధ్యాహ్న సమయాన్ని సూచించే ఘంటారావం చెవులపడటంతో అందరి దృష్టి మరియొకసారి మహారాజులవారి మీదికి మరలింది.

"నేరాలు చేసి తప్పించుకోగలమని, రాజ్యాధికారుల కళ్ళుపడకుండా హాయిగా బ్రతుకగలమనీ భావించే వారందరికీ హెచ్చరిక చేస్తున్నాము.

అన్యాయం ఎంతోకాలం దాగివుండదు. ఏదో ఒక సమయంలో బట్టబయలై తీరుతుంది. అప్పుడు విధింపబడే శిక్ష చాలా భయంకరంగా వుంటుంది. ప్రాజ్ఞులై మెలగండి ప్రజలు అందరూ. నీతివర్తనులై జీవించండి...” అంటూ ధర్మాసనం మీది నుండి లేచి నిలుచున్నాడు మహారాజు.

వినయ విధేయతలను ప్రదర్శిస్తూ సభలోని వారందరూ లేచి నిలబడి చేతులు జోడించి ఆయనకు అభివాదాలు చేశారు.

మహామంత్రి ధర్మదత్తుడు వెన్నంటి నడుస్తుండగా సభా భవనంలోనుంచి బయటికి బయలుదేరాడు మహారాజు కీర్తిసేనుడు.

భవనాన్ని దాటి పది అడుగులుకూడా వేయకముందే అగుపించింది ఆయనకు ఒక దృశ్యం.

“రాజసభ ఈ రోజుకు పరిసమాప్తి అయింది. మహారాజులవారు అంతఃపురానికి వెడలిపోతున్నారు. ఈ రోజుకు ఇక ఎవరికీ దర్శనం ఇవ్వరు... మీరందరూ వెళ్ళిపోండి” అని కరుకు కంఠాలతో హెచ్చరిస్తూ తమ హస్తాలలో వున్న వాడి శూలాలతో అనేక మంది గ్రామీణుల్ని అవతలికి నెడుతున్నారు రాజభటులు

ఆ మాటల్ని వినిపించుకోకుండా ముందుకు రావటానికిప్రయత్నిస్తున్నారు గ్రామీణులు.

దూరంగా వెడలిపోతున్న మహారాజు ఒక్క క్షణకాలం ఆగి తమకేసి చూడటాన్ని గమనించాడు ఆ గ్రామీణుల్లో వృద్ధుడు ఒకతను.

"మహారాజా.... మమ్మల్ని కాపాడండి.... మహాప్రభూ! మాకు ఒకసారి దర్శనభాగ్యం కలిగించండి...." అంటూ ఎలుగెత్తి అరిచాడతను వెంటనే.

గిరుక్కున వెనుతిరిగి సభాభవనం ముంగిటికి వచ్చేశాడు కీర్తిసేన మహారాజు.

గ్రామీణుల్ని అడ్డుకుంటున్న రాజభటులకు సైగచేసి వారందర్నీ లోనికి పంపించమని ఆజ్ఞ ఇచ్చాడు.

భూనభోంతరాళాలు దద్దరిల్లిపోయేలా ఆయనకు జయజయధ్వానాలు చేస్తూ గుంపుగా సభాభవనంలోకి వచ్చారు గ్రామీణులు అందరూ.

ఎన్నడూలేని ఆ విచిత్ర దృశ్యాన్ని వీక్షించటంకోసం ఎక్కడివారక్కడ ఆగిపోయారు మహారాజుతో పాటు సభను వీడివెళ్ళిపోతున్న సామంత దండనాయకులు తదితరులు అందరూ.

"గ్రామసీమల్లో హాయిగా కాలక్షేపం చేస్తూ వుండవలసినవారి మీరు.. మీ మీ పనులను చెడగొట్టుకుని రాజధానికి రావల్సినంత అవసరం ఎందుకు ఏర్పడింది? " ధర్మాసనంమీద

ఆశీనుడౌతూ గ్రామీణుల్ని ప్రశ్నించాడు

మహారాజు.

***End of Preview.***

***Rest of the book can be read @***

***http://kinige.com/kbook.php?id=174***